కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఎంపిడిఓలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలు కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2022 బ్యాచ్‌కు చెందిన 34 మంది శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను కలిశారు. మరో వారం రోజుల్లో శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరుతామన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలెక్టర్‌తో ట్రైనీ ఎంపిడిఓలు

విద్యా ప్రమాణాలు ఉత్తమ స్థాయిలో ఉండాలి

- జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యాప్రమాణాలు ఉత్తమ స్థాయిలో ఉండాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగేటట్లు విద్యాశాఖ కృషి చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇళ్లు అందేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో ప్రధానమంత్రి అవాస్ యోజన గృహ నిర్మాణాల తీరును వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఒక్కో ఇంటికీ ఇస్తున్న రూ.లక్షా 80 వేలు సరిపోవడం లేదని, రూ.3 లక్షలా 50 వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలో సిమెంట్ గొడౌన్లు పెట్టి సిమెంట్‌ను లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. డిఆర్‌డిఎ నుంచి రుణాలు ఇవ్వడం, నిధులు ఖర్చు పెట్టే విషయం ప్రజాప్రతినిధులకు తెలియడం లేదన్నారు. డప్పు కళాకారులకు పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో విద్యా విధానంలో మార్పు రావాల్సిన అవసరముందన్నారు. జెడ్‌పి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు త్వరగా బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతున్న తీరును వివరించారు. ఈ స్థాయీ సంఘ సమావేశాల్లో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, పలువురు జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక విద్య నిర్వీర్యం

యుటిఎఫ్ జాతాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక విద్య నిర్వీర్యం అవుతోందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ విమర్శించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా నిర్వహిస్తున్న జాత శనివారం రాత్రి పాడేరు చేరింది. ఈ సందర్భంగా పాడేరు పుర వీధుల్లో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు దేముడు యుటిఎఫ్ జండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ రాష్ట్రంలో యుటిఎఫ్ ఒక్కటే పోరాడుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఏడు వేల మంది సభ్యులతో ఆవిర్భవించిన యుటిఎఫ్ నేడు లక్ష నలభై వేల మంది సభ్యులతో బలమైన ఉపాధ్యాయ సంఘం గా ఆవిష్కతమైందన్నారు. స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకొని అక్టోబర్ 1న విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సభలో విద్యా రంగ సమస్యలపై ఉపాధ్యాయుల గళం వినిపించేందుకు యుటిఎఫ్ సిద్ధమైనట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ నిరంతర పోరాటం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ్, జిల్లా కార్యదర్శి వీ మహేష్, జిల్లా నాయకులు నాగేశ్వరరావు, చిట్టిబాబు, ధర్మారావు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే మహిళా బిల్లు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బిజెపి ప్రభుత్వం మహిళ బిల్లును తీసుకొచ్చిందని ఆమ్‌ఆద్మీ పార్టీ అల్లూరి జిల్లా ఇన్చార్జి ఎం.సుజాత విమర్శించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల్లో భాగంగానే మహిళ బిల్లును ప్రవేశపెట్టారని అన్ని పార్టీలు గమనిస్తున్నాయని చెప్పారు. ఆమోదం పొందిన వెంటనే అమలు చేయకుండా 2029 నుంచి అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రానున్న 2024 ఎన్నికల్లో మహిళల రిజర్వేషన్లు అమలు పరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

25న డుంబ్రిగుడ మండల సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రికార్డులతో సమయానికి హాజరు కావాలని ఆమె సూచించారు. గైర్హాజరైన అధికారులపై శాఖ పరమైన చర్యలు తప్పదని ఆమె హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సర్వే చేసిన భూములను సకాలంలో అప్‌లోడ్ చేయాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి రంపచోడవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూహక్కు భూరక్ష ప్రోగ్రాం ద్వారా సర్వే చేసిన భూములన్నిటినీ సకాలంలో అప్‌లోడ్ చేయాలని రంపచోడవరం ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఐటిడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ రంపచోడవరం రెవెన్యూ డివిజన్ ఏడు మండలాల్లో 78 మంది విలేజ్ సర్వేయర్లు, నలుగురు డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది మండల సర్వేయర్లు 13 టీములుగా ఏర్పాటు చేసి ఇప్పటివరకు 273 గ్రామాలలో ఒక లక్ష 601 ఎకరాలకు సర్వే చేసి 170 గ్రామాలకు సంబంధించిన రికార్డులు పూర్తి చేసినట్లు చెప్పారు. సర్వే చేసిన భూములన్నింటినీ తప్పులు లేకుండా పూర్తిస్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇంకా ఎన్ని గ్రామాలలో, ఎన్ని ఎకరాలకు సర్వే చేయవలసి ఉందో ఆరా తీశారు. నోడల్ అధికారుల అనుమతి లేకుండా విలేజ్ సర్వేయర్లు సెలవులు పెట్టరాదన్నారు. అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిన వారికి ముందుగా నోటీసులు ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారిని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. విధులపై అలసత్వం వహించిన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, బాబురావు, నాగభూషణం, మండల సర్వేయర్లు గోపాలకృష్ణ, సురేష్ బాబు, దొర తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్

నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సిపిఎస్)ను రద్దు చేసి ఇచ్చిన హామీ మేరకు పాత పింఛను పథకం (ఒపిఎస్)ను అమలు చేయకుండా ఉద్యోగులను నిలువునా మోసం చేశారని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్ మోహన్ రావు, ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు అన్నారు. శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2004 నుంచి అమలు అవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం రద్దుపైన ముఖ్యమంత్రి మాట తప్పి కేబినెట్ సమావేశంలో గ్యారెంటీ పింఛను పథకం (జిపిఎస్) ను ఆమోదింపజేయడం 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షన్లను మోసం చేయటమే అని విమర్శించారు. కేబినెట్ సమావేశంలో సిపిఎస్ ను రద్దు చేస్తూ జిపిఎస్ ను ఆమోదిస్తున్నట్టు తీర్మాణం చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు

గొర్రెల బంధవీధి పాఠశాలకు భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి గొర్రెల బంధవీధి గ్రామంలో పాఠశాలకు భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే భవన నిర్మాణం చేయాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. పిటిజిలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, వారికి ఏడాదికి 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, అటవీ హక్కు పట్టాలు ఇవ్వాలని కోరారు. దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీల గిరిజనులకు కుటుంబానికి 5 ఎకరాల తక్కువ లేకుండా జీడి మామిడి తోటలు మంజూరు చేయాలన్నారు. కాఫీ తోటలు అభివృద్ధికి ఏ విధంగా నిధులు మంజూరు చేస్తున్నారో అదే విధంగా పంచాయతీలో గిరి రైతులకు జీడి మామిడి తోటలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు గెమ్మెల పరమేశ్వరరావు, పిటిజి మండల నాయకులు పాంగి నాగేశ్వరరావు, కిల్లో బాబురావు, మాజీ సర్పంచి బాబురావు, వార్డ్ మెంబరు పాంగి పుల్లయ్య, గుంట సన్యాసిరావు పాల్గొన్నారు.

యు.చీడిపాలెం ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం యు.చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ మిరియాల రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎటిడబ్ల్యుఒ క్రాంతి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న కిలో వంశీకృష్ణ అనే విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడని అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా, హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎటిడబ్ల్యుఒ వెల్లడించారు.

రక్తదానం చేస్తున్న దాతలు

కళాశాలల్లో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి పాడేరు : స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిగ్రీ కళాశాల, హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పాడేరు డిగ్రీ కళాశాల, హుకుంపేట జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సభ్యులు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రక్తదానం చేసేందుకు యువకులు, ఉత్సాహవంతులు ముందుకు రావాలని కోరారు. జిల్లా కేంద్రంలో రక్త నిలువలను పెంచేందుకు బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు జిల్లా కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అంతకముందు రక్తదాన శిబిరాన్ని డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రధాన చార్యులు వనుము చిట్టబ్బాయి, హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రధాన చార్యులు కొట్టగుల్లి సింహాచలం నాయుడు ప్రారంభించారు. పాడేరు డిగ్రీ కళాశాలలో సిబ్బంది విద్యార్థులు 19 మంది రక్తదానం చేశారు. హుకుంపేట ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ కళాశాల సిబ్బంది, బీజేవై నాయకులు 11మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రూపకళ, వైజాగ్ డాక్టర్ బివివి ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, స్థానిక సభ్యులు సూర్యారావు, జయలక్ష్మి, గౌరీ శంకర్, బ్లడ్ బ్యాంక్ పాడేరు- విశాఖపట్నం రెడ్ క్రాస్, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: జీవో 3 రద్దు తర్వాత సుప్రీంకోర్టులో రివ్యూ కొనసాగుతుండగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేకుండా దొడ్డిదారిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నిర్వహిస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, మాజీ జిల్లా అధ్యక్షుడు కుడుముల కాంతారావు డిమాండ్ చేశారు. ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో రెండవ రోజు శనివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షలో జేఏసీ కన్వీనర్ రామారావు దొర, ఏపీటీఎఫ్ నాయకురాలు శాంతకుమారి పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న జెఎసి నేతలు

18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 41.15 కాంటూరులో ఖాళీ చేయబడుతున్న గ్రామాల్లో ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు నిర్వాసితులుగా గుర్తించి వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చొక్కానపల్లి, రాజుపేట సిపిఎం జోనల్ కమిటీ సమావేశం తోడంరాజు అధ్యక్షతన చొక్కనపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎప్పుడో 2017లో నోటిఫికేషన్ ఇచ్చిన నాటికి 18 ఏళ్లు నిండిన వారినే అర్హులుగా గుర్తించారని, దీని వల్ల ఈ కాలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు జీవనాధారం లేక ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2017లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఆరు సంవత్సరాలు పూర్తవుతుందని, చట్ట ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి మూడు సంవత్సరాలు దాటితే, రీ నోటిఫికేషన్ ఇవ్వాలని, అయినా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం, దారుణమన్నారు. పునరావాసానికి కేటాయించిన ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇళ్లు, రోడ్లు, మంచినీటి సౌకర్యం, పాఠశాలల, అంగన్‌వాడీ భవనాలు, గుళ్ళు గోపురాలు నేటికీ పూర్తి కాలేదని, అవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ముంపు పేరుతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలుపుదల చేయడం దారుణమన్నారు. కనీసం గ్రామాల్ని ఖాళీ చేసి పునరావాస గ్రామాలకు వెళ్లే వరకైనా ప్రభుత్వం కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మాజీ సర్పంచులు బూభమ్మ, సీతమ్మ, గుండెపూడి లక్ష్మణరావు, దారయ్య, సోడేమల్లయ్య, ఆత్మకూరి కాంతారావు, నాలారపు ప్రకాష్‌రావు, కోట్ల రాజు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు, పార్టీ కార్యకర్తలు

జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం రామారావు తదితరులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన రంపచోడవరం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నియోజకవర్గ క్రీడా పోటీల్లో మారేడుమిల్లి పాఠశాల విద్యార్థులు అండర్ 17 సీనియర్స్ విభాగం నుండి గొల్లోరి రవి (వాలీబాల్), కోండ్ల బుచ్చిబాబు (ఖోఖో), గొల్లోరి రవి (డిస్క్ త్రో) గొల్లోరి రవి (జావిలిన్) కత్తుల శివ సాయి భవాని రెడ్డి (షెటిల్ బ్యాడ్మింటన్), అండర్ 14 జూనియర్స్ విభాగం నుండి కడబాల రాజారెడ్డి (త్రో బాల్), పల్లాల బుజ్జిబాబు (త్రో బాల్), పల్లాల శివ శంకర్ రెడ్డి (ఖో ఖో) పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు, వారికి తర్ఫీదు పిడి బి.సుదర్శన్‌రావు, పిఈటి ప్రసాదరావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొంది పాఠశాలకు మంచి పేరుని తీసుకురావాలని కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఆరుగురు ఎంపిక

సీలేరు : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాడేరు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో జికె.వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల బయాలజీ ఉపాధ్యాయులు జి.దామోదరు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముందుగా మండల స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొని 9 మంది నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, అనంతరం శనివారం పాడేరు నియోజవర్గ స్థాయి కబాడీ పోటీల్లో పాల్గొని విద్యార్థులు సత్తా చాటి ఐదుగురు బాలురు, ఒక బాలిక ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. త్వరలో అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో జరగనున్న ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన కె.శివ, కె.మధు, ఎస్.విక్రమ్, పి.జ్ఞానేశ్వరరావు, కె.ఆది, మండి దివ్యకు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆథ్లెటిక్స్‌లో ఏకలవ్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మారేడుమిల్లి : ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ -2023 పోటీల్లో మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఎం.నాగలక్ష్మి అండర్- 18 జావులింగ్ త్రోలో బంగారు పతకం సాధించగా, అండర్- 16 విభాగం ఐ జంప్‌లో ఎన్. అమర్నాథ్ బ్రౌన్జ్ మోడల్ మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిద్దరూ ఈనెల 17వ తేదీన ఆటల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్పోర్ట్స్ సెలక్షన్‌లో సెలెక్ట్ అయ్యి ఈనెల 22న జరిగిన డిస్టిక్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ ఆటల పోటీల్లో పాల్గొని ఈ బహుమతులు గెలుచుకున్నారు. వీరిని పాఠశాల ప్రిన్సిపల్ టి అరుణ కుమారి అభినందించారు. పాఠశాలకు మరిన్ని పతకాలు తీసుకువచ్చి ఉన్నత స్థాయిలో నిలపాలని ఆమె సూచించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డి ప్రమోద్‌ను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపికైన సీలేరు విద్యార్థులు

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థిను అభినందిస్తున్న ప్రిన్సిపల్

గ్రామ సభకు హాజరైన గ్రామస్తులు

భూ రీసర్వేపై గ్రామ సభ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని పెద లువ్వాసింగి పంచాయితీ శంకులమెట్ట గ్రామంలో శనివారం భూ రీసర్వేలో భాగంగా స్థానిక సర్పంచ్, ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ రీసర్వేలో 25 మందికి పట్టాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలస్వామి, మాజీ సర్పంచ్ గబ్బాడి పండు దొర, సింగర్ల సచివాలయం కన్వీనర్ సూర్యప్రకాష్, నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-పాడేరు: విశాఖపట్నం మారికవలస గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి తెరవాడ చంద్ర కిరణ్ మృతి చెందాడని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య అల్లూరి జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చిన్నారావు శనివారం వేర్వేరు ప్రకటనలలో ఆరోపించారు. ఈ విద్యార్థి మతిపై తక్షణమే ఉన్నతాధికారులతో విచారణ జరిపించి ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థి ఆరోగ్యం బాగో లేకపోయినా సకాలంలో వైద్య సేవలు అందించకపోవడంతో ఆరోగ్యం విషమించిందని, ఆ సమయంలో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు.విద్యార్థి వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడని తెలిపారు. విద్యార్థికి సకాలంలో వైద్య సేవలు అందించి ఉంటే, ప్రాణాపాయం తప్పి ఉండేదన్నారు.ఆరో తరగతి చదువుతున్న ప్రవీణ్ కూడా విశాఖపట్నం కెజిహెచ్ లో చికిత్స పొందుతూ మతి చెందినట్లు వారు తెలిపారు. మృతి చెందిన తెరవాడ చంద్ర కిరణ్ కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

ఘనంగా వినాయక ఉత్సవం

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన సిద్ధి వినాయకుని నిమజ్జనం శనివారం సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డింసా, కోలాటాలు, అఘోర వేషాలతో అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు

పరిశ్రమలలో సిఎఫ్‌డి పాత్రపై సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : పరిశ్రమలలో ముఖ్యంగా ఆటో మొబైల్ పరిశ్రమల రంగంలో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సిఎఫ్‌డి) పాత్రపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. చెన్నైకు చెందిన వాలియో సంస్థ సీనియర్ సిఎఫ్‌డి ఇంజనీర్, గీతం పూర్వవిద్యార్థి పి.భాస్కరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వాహన ఏరోడైనమిక్స్, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ థర్మల్‌మేనేజ్‌మెంట్ తదితర విభాగాలలో సిఎఫ్‌డి ప్రయోజనాలను వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సిఎఫ్‌డి వంటి సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించాలని, తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ అధ్యక్ష వహించారు. కార్యక్రమ కో-ఆర్డినేటర్ డి.నాగరాజు, అబ్దుల్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి -మధురవాడ : దోపిడీకి పాల్పడిన ఇద్దరికి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించినట్లు నేర విభాగం ఎసిపి రంభ శ్రీనివాసరావు తెలిపారు. ఎసిపి కథనం ప్రకారం... మధురవాడకు చెందిన పి.వెంకటమహేష్ 2020 సెప్టెంబర్‌లో నగరంలోని కురుపాం మార్కెట్ నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరారు. మార్గ మధ్యలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి అతను వద్ద ఉన్న నగదును దోచుకున్నారు. అప్పట్లో కేసు నమోదు చేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధించినట్లు తెలిపారు.

గిరిజన యువతకు...

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించండి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్
గిరిజన ప్రగతిపై అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న అనంతనాయక్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనాభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టి గిరిజనుల జీవనోపాదులు మెరుగు పరచాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు అనంత నాయక్ సూచించారు. గిరిజనులకు ఉపాధి ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన హక్కులు కాపాడాలని పేర్కొన్నారు. గిరిజన భాషలను, గిరిజన సాంప్రదాయ కళలు, నృత్యాలు పరిరక్షించి భావి తరాలకు అందించాలని చెప్పారు. గిరిజన యువత వ్యవసాయ పనుల్లో తలిదండ్రులకు సాయం చేస్తుంటారని ఆ దిశగా ఒకేషనల్ విద్యను అందించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలన్నారు. వ్యవసాయ భూమి లేని గిరిజన కుటుంబాల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. విద్య, వైద్య ఆరోగ్య సేవలు, గృహ నిర్మాణ పథకాలు, పౌర సరఫరాలు, తాగునీటి పథకాలు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ ఉద్యాన వన శాఖలపై సమీక్షించారు. ప్రతీ గిరిజన గ్రామానికి విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళతామన్నారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, భూముల రీసర్వే, గృహ నిర్మాణాలు, జల్ జీవన్ మిషన్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మన బడి నాడు, వైద్య ఆరోగ్య సేవలు, సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు, గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన వనాలు పెంపకం, వ్యవసాయ పథకాల అమలు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్టీ కమీషన్ సభ్యులు అనంత నాయక్, ఆయన అధికార బృందాన్ని ఘనంగా సత్కరించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, గిరిజన సంక్షేమశాఖ డిడి ఐ. కొండలరావు, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం. వేంకటేశ్వరరావు, టిసిఆర్‌టిఎం అధికారి జి. చినబాబు, ఎస్టీ కమిషన్ అధికారులు పి.కె. పరీడా, జయంత్ జె.సరోడే, రాధాకాంత త్రిపాఠి, ఆర్. ఎస్. మిశ్రా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో పర్యటన

అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు అనంత నాయక్ డైరెక్టర్ల బందం సందర్శించారు. మొదటగా పద్మాపురం బొటానికల్ గార్డెన్ ను సందర్శించారు. గార్డెన్ లోపల పాడేరు ఐటిడిఏ నిర్మించిన ట్రీ హార్ట్స్ ను సందర్శించి తిలకించారు. టాయ్ ట్రైన్ ఎక్కి గార్డెన్ చుట్టూ తిరిగి గార్డెన్ అందాలను తిలకించారు.అనంతరం అరకులోయలోని గిరిజన సంస్కృతిక మ్యూజియంను సందర్శించి తిలకించారు. మ్యూజియంలోపల గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడే విధంగా ఉన్న వివిధ గిరిజన సంప్రదాయ ప్రతిమలను తిలకించి పలు సూచనలు ఇచ్చారు.అరకులోయ సందర్శిత ప్రాంతాలు మరింతగా అభివద్ధి పరచవలసిన ఆవశ్యకత ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఏ మేనేజర్ ప్రభాకర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, గిరిజన సంస్కృతిక మ్యూజియం మేనేజర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ ఎల్.బుజ్జి బాబు, అరకులోయ ఎమ్మార్వో వేణుగోపాలరావు, ఎంపీడీవో నగేష్, ఏటిడబ్ల్యూఓ మల్లికార్జునరావు, పెద్దలబుడు మేజర్ పంచాయతీ ఈవో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పెదబయలు: విశాఖ ఉక్కు రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కార్మికులు ఆ ప్రాంత ప్రజలతో వెయ్యి రోజులకు పైగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదన్నారు. మన రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఈ పోరాటానికి విశాలమైన మద్దతు లభిస్తుందని తెలిపారు.ఈ నెల 29న కూర్మన్నపాలెం దీక్ష శిబిరం వద్ద చేపట్టే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కే.సర్బన్న, బొండా గంగాధరం, చండ రామారావు పాల్గొన్నారు.

హుకుంపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై ఉక్కు రక్షణ బైక్ యాత్ర జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి పిలుపునిచ్చారు. శనివారం వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేయాలన్న కేంద్ర ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలన్నారు. ప్రతిఒక్క యువతీ యువకులు ప్రజలందరూ ముక్తకంఠంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణను ఖండించాలన్నారు. ఎంతోమంది త్యాగంతోనే స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని, ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ప్రత్యేక హెూదా రైల్వే జోన్, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం చేతకాని కేంద్రం ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ పరం చేయడంతో ముందుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండ పాడల్, నాయకులు రామారావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పెనుగులాటలో బటన్ నైఫ్ తగిలి యువకుడు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఐదుగురు యువకుల మధ్య జరిగిన పెనుగులాటలో బటన్ నైఫ్ తగిలి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విశాఖలోని పాత నగరం ఎవిఎన్ కాలేజీ సమీపంలో ఆసిపాప వీధిలో జరిగిన ఈ ఘటన వివరాలను వన్ టౌన్ పోలీసులు శనివారం మీడియాకు వెల్లడించారు. మైలపల్లి చిన్నా అలియాస్ విక్కీ, కొమర సింహాద్రి, కూడా పవన్ కుమార్, రాగతి ధనుష్, ఎమ్‌డి హుస్సేన్ గురువారం తెల్లవారుజామున గొడవపడ్డారు. ఆ సమయంలో తొలుత ఎమ్‌డి హుస్సేన్‌కు బటన్ నైఫ్ తగిలి గాయమైంది. ఆ కత్తిని లాక్కొనే సమయంలో వారి మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే 38వ వార్డు భజన కోవెల వీధికి చెందిన మైలపల్లి చిన్నా అలియాస్ విక్కీ (17)కి ఆ బటన్ నైఫ్ గొంతు వద్ద గుచ్చుకుంది. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. మిగతా వారు విక్కీ మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి ఆటో డ్రైవర్‌ను పిలిచి వినాయక మండపం వద్ద చెత్తాచెదారం ఉందని, దానిని తీసుకువెళ్లి సముద్రంలో పారవేయాలని కోరారు. ఆటో డ్రైవర్ పెద్ద గోనె సంచెను ఆటోలో తీసుకెళ్లి ఫిషింగ్ హార్బర్ 11వ నెంబర్ జెట్టీ వద్ద విసిరేసి ఇంటికి వచ్చాడు. ఆటోలో రక్తం మరకలు చూసి తనతో బేరం ఆడిన నలుగురు యువకులను ప్రశ్నించాడు. వారు జరిగినదంతా చెప్పారు. దీంతో ఆటో డ్రైవర్ వన్‌టౌన్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ నలుగురు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. గోనె సంచిలో కట్టి ఉన్న విక్కీ మృతదేహం శనివారం సముద్రం నుంచి ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పరిధిలో బాలిక అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... మారికవలస రాజీవ్‌గృహకల్పకు చెందిన బి.నాగలక్ష్మి స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 21వ తేదీన పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అప్పట్నుంచి బంధువుల ఇళ్లలో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం

ప్రజాశక్తి -ములగాడ : జాతీయ సేవా పథకంలో చేరడం ద్వారా వ్యక్తిత్వం వికసిస్తుందని, నాయకత్వం సిద్ధిస్తుందని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఆడిటోరియంలో జాతీయ సేవా పథకం దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘ సంస్కరణకు, అభివృద్ధికి, సామాజిక మార్పునకు, శాంతి సౌభాగ్యాలకు జాతీయ సేవా పథకం దోహదపడుతుందని తెలిపారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద యువజన ఉద్యమం జాతీయ సేవా పథకం అని పేర్కొన్నారు. జాతీయ సేవా పథకంలోని రెగ్యులర్ కార్యక్రమాలపై వై.అనసూయాదేవి, ప్రత్యేక సేవా శిబిరాలపై వి.అంజలీదేవి, జాతీయ అవకాశాలపై నదియా, యోగా, స్వచ్ఛభారత్‌పై సంధ్యారాణి ప్రసంగించారు. అనంతరం జాతీయ సేవా పథకం కార్యక్రమాలపై క్విజ్ నిర్వహించారు.

ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరిస్తూ మోడీ మోసం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరిస్తూ ప్రధాని మోడీ దేశ ప్రజలను మోసగిస్తున్నారని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 903వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మోసాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మోడీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దీక్షల్లో ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి వై.నరసింగరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నాయకులు సత్యనారాయణ, చిన్నబాబు

రేఖపల్లిని పోలవరం ముంపు జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామాన్ని పోలవరం ముంపు గ్రామాల జాబితాలో వెంటనే చేర్చి ప్యాకేజీ, పునరావాసం ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విఆర్.పురం మండల కేంద్రం రేఖపల్లి గ్రామ సిపిఎం శాఖ సమావేశం సిరపూ తాతబాబురెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేఖపల్లి గ్రామాన్ని మొదటి కాంటూర్‌లో చేర్చాలని లేకుంటే రానున్న రోజుల్లో చింతూరు ఐటిడిఎను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ నాయకులు గూటాల శ్రీనివాసరావు, వేటి లక్ష్మి ప్రకాష్ రావు, సుబ్బారావు, వీర్ల నాగేశ్వరరావు, చక్రపాణి, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి-కొయ్యూరు : ఈ-క్రాప్ నమోదుపై మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతు, వారు సాగు చేసిన పంట వివరాలు, సాగు విస్తీర్ణం సేకరించి ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ క్రాప్‌లో తలెత్తే సాంకేతిక సమస్యలు గురించి చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సౌమ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. పోషకాహారాలు తీసుకోవాలని, వేడి ఆహార పదార్థాలను భుజించాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. డైనింగ్ హాలు, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందితే మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు బారిన పడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ డిఎస్పి సురేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది. సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల కేంద్రం రాజవొమ్మంగిలో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ నగర్, శివాలయం వీధి, గాంధీ బొమ్మ సెంటర్, నూకలమ్మ గుడి వీధి తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో మందు గుండు సామగ్రి, నృత్యాలతో ఊరేగించి అప్పలరాజుపేట చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాజవొమ్మంగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి వెంకట్రావు చౌదరి, కె నూకరాజు, వి శ్రీను, పి ప్రసాద్, వి సత్తిబాబు, దేవి, అమ్మాజీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలపై లేఖ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఆందోళన వ్యక్తం చేస్తూ తెలుగు శక్తి అధ్యకుడు బివి.రామ్ శనివారం ఢిల్లీలోని రాష్ట్రపతి కార్యాలయంలో లేఖ అందజేశారు. రాష్ట్రంలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలు చేస్తూ ప్రజల స్వేచ్ఛను పోలీసులు హరిస్తున్నారన్నారు.

బహుళ ప్రాజెక్టులతో విశాఖ అభివృద్ధి

పెరగనున్న విఎంఆర్‌డిఎ పరిధి
త్వరితగతిన మెట్రో రైలు ప్రాజెక్టు పనులు
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

దేశంలోనే అత్యంత కీలకమైన నగరం విశాఖపట్నమని, బహుళ ప్రాజెక్టులతో దీని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు. వేల కోట్లతో విఎంఆర్‌డిఎ పరిధిలోని మూడు జిల్లాల్లో చేపట్టబోయే పలు ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధి, సంబంధిత అంశాలపై స్థానిక విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, మెట్రో ఎమ్‌డి రావు, తదితర అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బహుళ ప్రాజెక్టులతో విశాఖ రూపురేఖలు మారిపోనున్నాయని, పక్కా మాస్టర్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో విఎంఆర్‌డిఎ పరిధిలో చేపట్టబోయే ప్రాజెక్టులు, మెట్రో రైలు కారిడార్ గురించి పిపిటి ద్వారా జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో గుర్తించదగిన మహా నగరాల జాబితాలో విశాఖపట్నం ఉండటం గమనించాలన్నారు. పచ్చదనానికి, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ బృహత్ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇప్పుడున్న విఎంఆర్‌డిఎ పరిధి సుమారు 2,456 చదరపు కిలోమీటర్ల మేర పెరగనుందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి ప్రాజెక్టులను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. బీచ్ కారిడార్‌లో భాగంగా కాపులుప్పాడ వద్ద సిగ్నేచర్ టవర్, ఆధునిక వసతులతో కూడిన కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలన్నారు. అదే ప్రాంతంలో నేషనల్ హిస్టరీ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించిన భూసేకరణలో వీలుంటే గుజరాత్ మోడల్‌ను అనుసరించాలన్నారు. జల ఉద్యానవనం, నగరంలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగమారిపేట వద్ద జల క్రీడలకు సంబంధించిన పార్కు నిర్మించాలని, వినూత్న క్రీడలను పరిచయం చేయాలని పేర్కొన్నారు. కైలాసగిరి కొండపై సైన్స్ సిటీని అభివృద్ధి చేయాలని, ముడసర్లోవ పార్కుతో పాటు మిగిలిన పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నీటి కొలనుల రూపు మారకుండా సరిహద్దులు గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్ధ చంద్రాకారంలో విశాఖ నగరాన్ని అనుసంధానించేలా రింగు రోడ్డును నిర్మించాలన్నారు. హైదరాబాద్‌లోని కళాభారతి మాదిరిగా స్థానిక కళావాణి ఇండోర్ స్టేడియాన్ని సుందరీకరించాలని చెప్పారు.

నాలుగు విభాగాలుగా మెట్రో ప్రాజెక్టు

లైట్ కారిడార్, మోడరన్ కారిడార్ పేర్లతో రూపొందుతున్న మెట్రో రైలు ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని జవహర్ రెడ్డి సూచించారు. నాలుగు విభాగాలుగా ప్రాజెక్టు రూపొందుతుందని తెలిపారు. మొదటిది స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు, రెండోది గురుద్వార జంక్షన్ నుంచి పోస్ట్ ఆఫీస్ వరకు, మూడోది తాడిచెట్ల పాలెం నుంచి చినవాల్తేర్ వరకు, నాలుగోది కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 76.90 కిలోమీటర్ల మేర వేయనున్నామని మెట్రో ఎమ్‌డి యుజె.రావు వివరించారు. సమీక్ష సమావేశంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై

27న ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా

జయప్రదం చేయాలని వామపక్షాల పిలుపు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ ఈ నెల 27న విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను తక్షణమే రద్దు చేయాలంటూ మద్దిలపాలెం పిఠాపురంకాలనీలో ఉన్న సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో శనివారం వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిఎన్.క్షేత్రపాల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, జివిఎన్.చలపతి, ఎం.వి.త్రినాధరావు, పి.వెంకటరావు, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్లాబుల మార్పుతో విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం విపరీత భారాలు మోపిందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారాలు దెబ్బతిని, ఉపాధి తగ్గుతోందని అన్నారు. డిస్కమ్‌లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిపై వడ్డీ కూడా ప్రజల నెత్తిన రుద్దడం దారుణమన్నారు. ఇళ్లకు, షాపులకు స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని, ప్రతి కనెక్షన్‌కు రూ.13 వేలు భారం పడనుందని తెలిపారు. ఇప్పటికే ప్రజలపై మూడేళ్ళ నుంచి వైసిపి ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపుతోందన్నారు. ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు వ్యతిరేకిస్తున్నా వాటిని లెక్కచేయకుండా భారాలు వేయడం సరైందికాదన్నారు. మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తెస్తే ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటన్నారు. రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలపై ప్రతిఘటనోద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నామన్నారు.

ఆకట్టుకున్న పోషకాహార ప్రదర్శన

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సంపూర్ణ పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఆహారంలో పాలు, గుడ్లు, చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన పోషకాలు లభ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్జో, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ త్రినాథ్, ఏఎన్ఎం దేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ మోహిని, అంగన్వాడీ టీచర్లు రుక్మిణి ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు కరుణమణి, వసంత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కొయ్యూరు : సిపిఐ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శివలంక కొండలరావు పిలుపునిచ్చారు. మండలంలో కించెలి గ్రామంలో శనివారం సిపిఐ మండల సమితి సమావేశం పొట్టిక మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంఘాల నిర్మాణం ద్వారా పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రజా సమస్యలపైనా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపైనా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గం నుండి సిపిఐ బరిలో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, రావణాపల్లి ఎంపీటీసీ సత్యవాణి, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు వియ్యపు నానాజీ, దర్శి సతీష్, మాదల సత్యనారాయణ, మాతే సన్యాసిరావు, ఎంవి రమణమూర్తి, గుల్ల జోగరాజు, కురుజు ధర్మరాజు, ముకే వెంకటరమణ, ముకే ఎర్ర అచ్చయ్య, పార్వతి, లక్ష్మి, ముకే జోగులమ్మ పాల్గొన్నారు.

రోబోటిక్ పరికరాల తయారీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రోబోటిక్ పరికరాల తయారీలో విశేష ప్రతిభ కనబరిచారు. గత 3 రోజులుగా అటల్ టింకరింగ్ ల్యాబ్ ట్రైనర్స్ పార్థు, రాంబాబు ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో విద్యార్థులు అత్యాధునికమైన అతి సులువుగా 7 రోబిటిక్ వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. స్మార్ట్ వీల్ చైర్, స్మార్ట్ షాపింగ్ ట్రే స్ప్రై, రోబో ఫ్లోర్ క్లీనింగ్, రోబో సర్వీసింగ్ రోబో, అగ్రికల్చర్ రోబో, ఇంటిలిజెంట్ ట్రైన్ లైన్, లైన్ ఫాలోయింగ్ రూపంలో తయారు చేశారు. 3 రోజులు అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఈ రోబోటిక్ పరికరాలను మండలానికి చెందిన వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు శనివారం సందర్శించారు. విద్యార్థుల ఆసక్తి మేరకు తాము విద్యార్థులతో రోబోటిక్ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందని పాఠశాల హెచ్ఎం రాజ దినకర్, పిఎస్ ఉపాధ్యాయులు చప్పా ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే పరమావధిగా సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎల్లవేళలా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును కాంక్షిస్తూ నిస్వార్థంగా సేవలు అందించే వ్యక్తుల్లో నర్సులు ఎంతో కీలకమని డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాబ్జీ అన్నారు. శనివారం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, శ్రీమతి విజయ లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.